www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 6 ఆగస్టు 2025

5

చిత్తూరు



ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్

చిత్తూరు జిల్లాలో వున్న ప్రైవేటు విద్యాసంస్థల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టాలని పర్మిషన్ లెటర్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలో ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో అత్యధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్న వసూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలను పర్మిషన్ లేకుండా నడుపుతున్నారని, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడవద్దని అలాంటి విద్యాసంస్థలపై జిల్లా విద్యాధికారి పర్యవేక్షణ చర్య తీసుకోవాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని కోరారు. అనంతరం నూతన జిల్లా కమిటీ ఎన్నిక ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కన్వీనర్‌గా మనోజ్, కో కన్వీనర్ చాణక్య, కమిటీ సభ్యులుగా వెంకటేష్, దిలీప్, రఫీ, అభినేష్, కార్తీక్, ఢిల్లీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

మరో రూ. 12,771 కోట్ల విద్యుత్ భారం ఆపాలి

ధర్నాలో సిపిఎం - సిపిఐ డిమాండ్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: విద్యుత్ ఛార్జీలు పెంచడం లేదంటూనే మరలా ట్రూఅప్ పేరుతో మరో రూ.12,771 కోట్లు భారాన్ని మోపడాన్ని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల పిలుపుమేరకు మంగళవారం చిత్తూరు గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ వాడ గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు మాట్లాడుతూ తక్షణం పెంచిన కరెంటు ఛార్జీలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 2019- 20 నుండి 2023-24 సంవత్సరాలకు సంబంధించి విద్యుత్ రిటైల్ వ్యాపారంలో పేరుతో రూ.12,771 కోట్లు ట్రూ అప్ భారం వేయడానికి విద్యుత్ పంపిణీ సంస్థలు విద్యుత్ నియంత్రణ మండలికి ప్రతిపాదనలు పంపి బహిరంగ ప్రకటన చేశాయని, రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకుండా ఇది జరిగిందని, ప్రభుత్వం వెంటనే స్పందించి, ఛార్జీల పెంపుదలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. గత 36 నెలల నుండి 2014-19 కాలానికి సంబంధించిన రూ.3వేలకోట్లు ట్రూ అప్ ఛార్జీలు వసూలు చేశారని, కూటమి ప్రభుత్వం వచ్చిన సంవత్సరం కాలానికి రూ.15,485 కోట్లు సర్దుబాటు ఛార్జీల భారం మోపారని, ఇదికాక సంవత్సరానికి ప్రతినెలా యూనిట్‌కు రూ.40పైసలు చొప్పున ఒక్క సంవత్సరంలోనే రూ. 2787 కోట్లు వసూలు చేశారని అన్నారు. స్మార్ట్ మీటర్లు వలన అదనపు భారాలు సిద్ధంగా ఉన్నాయని, గత ప్రభుత్వం వేసిన విధంగా విద్యుత్ భారాలు వేయబోమని, తగ్గిస్తామని కూటమి పార్టీలు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ మాట తప్పిందని విమర్శించారు. విద్యుత్ ఛార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా, ట్రూఅప్/ ఇందన సర్దుబాటు ఛార్జీల విధానం రద్దుచేయాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయకపోతే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఆగస్టు 24 విద్యుత్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించి పెద్దఎత్తున ధర్నా చేస్తామని తెలిపారు. మరోసారి ఈ ప్రభుత్వానికి ప్రజలు కరెంట్ షాక్ తగలక ముందే ప్రభుత్వం స్పందించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గిరిధర్ గుప్తా, కార్మిక నాయకులు దాసు, ఆనంద్, ప్రతాప్, శ్రీరాములు, మునిస్వామి, డేవిడ్, సిపిఐ జిల్లా నాయకులు గోపీనాథ్, మణి, దాసరిచంద్ర, విజయ గౌరి, జామిలాబీ, రమాదేవి, విజయ్ కుమార్, కోమల, రఘు, లతా, గజేంద్ర బాబు, దేవయాని, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరిని విడనాడాలి

విజయపురం (నగరి): ఇళ్లకు, దుకాణాలకు, పవర్‌లూమ్స్‌కు పెడుతున్న స్మార్ట్ మీటర్లను రద్దుచేయాలని కోరుతూ మంగళవారం నగరి శాఖ కార్యదర్శి పెరుమాళ్ అధ్యక్షతన విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వద్ద నిరసనను వ్యక్తం చేస్తూ ధర్నా చేశారు. సీఐటీయూ తిరుపతి జిల్లా నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను బిగిస్తుంటే ఆనాటి టీడీపీ ప్రధాన కార్యదర్శి, నేటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బలవంతంగా ఎవరైనా స్మార్ట్ మీటర్లను తీసుకు వస్తే పగలగొట్టండని ఆగ్రహంగా మాట్లాడారన్నారని నేడు అదానీ స్మార్ట్ మీటర్లను బలవంతంగా బిగిస్తుంటే చోద్యం చూస్తున్నారన్నారు. ఇప్పటికే ట్రూ అప్ ఛార్జీలంటు దాదాపు 15 వేల కోట్లును గత 36 నెలలుగా సామాన్య ప్రజల నుండి ముక్కుపిండి వసూలు చేస్తూ ప్రజల ఉసురు పోసుకుంటున్నారని నేడు వారి తలపై గుదిబండలా స్మార్ట్ మీటర్లు పడిందన్నారు. స్మార్ట్‌మీటర్లు తొలగించకుంటే రాష్ట్రవ్యాప్త సమ్మెకు దిగుతామన్నారు. నాయకులు షణ్ముగం, జగదీష్, మైలు స్వామి, తంగరాజు, మురుగేశన్, బాబు, అరుణ్, జ్యోతి, అయ్యపన్, సందీప్, గోపి, నారాయణ స్వామి, ధనపాల్ పాల్గొన్నారు.



నగరిలో..

కంటైనర్‌ను ఢీకొన్న కారు

తల్లీ, కొడుకు, మనుమడు మృతి





మృతులు లక్ష్మీదేవి, శ్రీకాంత్

ప్రజాశక్తి- తవణంపల్లి: తిరుపతి– బెంగళూరు ఆరు లైన్ల జాతీయ రహదారిలో తవణంపల్లి మండలం పరిధిలోని తెల్లగుండ్లపల్లి సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న కంటైనర్‌ను తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్తున్న కారు వేగంగా ఢీకొనడంతో ముగ్గురు మృతి అక్కడిక్కడే మరణించారు. ప్రమాదంలో మృతి చెందిన వారు బెంగళూరుకు చెందినవారుగా గుర్తించారు. ఇదిలా ఉండగా మృతులు ముగ్గురు ఒకే కుటుంబంకు చెందిన తల్లి, కొడుకు, మనవడు. తవణంపల్లి ఎస్సై చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు శ్రీకాంత్, తల్లి లక్ష్మీదేవి, కుమారుడు శ్రియాన్ బెంగళూరు నుంచి తిరుమల దర్శనానికి వచ్చి తిరిగి కారులో వెళుత్తుండగా తవణంపల్లి మండలం పరిధిలోని తెల్లగుండ్లపల్లి సమీపంలో తిరుపతి– బెంగళూరు ఆరు లైన్ల జాతీయ రహదారిలో ఆగి ఉన్న కంటైనర్ లారీని వేగంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న శ్రీకాంత్ (35), అతని తల్లి లక్ష్మీదేవి(55) అక్కడిక్కడే మరణించారు. మూడేళ్ల చిన్నారి శ్రియాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మణింద్రం ఎంపీటీసీగా అరుణ ఏకగ్రీవం

టిడిపి ఖాతాలోకి మణింద్రం ఎంపిటిసి



టిడిపి ఎంపిటిసిగా అరుణకు డిక్లరేషన్ పామ్ అందిస్తున్న ఆర్ఓ లక్ష్మీకాంత్

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని మణింద్రం సెగ్మెంట్ ఎంపీటీసీగా తెలుగుదేశం పార్టీ అభ్యర్థి జి.అరుణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి లక్ష్మీకాంత్ ప్రకటించారు. ఎంపీటీసీ అరుణ జ్ఞానశేఖర్ రెడ్డి, కూటమి నేతలతో కలిసి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లుగా డిక్లరేషన్ పామ్‌ను లక్ష్మీకాంత్ అందజేశారు. ఈ ఉప ఎన్నికలకు సంబంధించి టిడిపికి చెందిన విశాలాక్షి, అరుణ, వైసిపీకి చెందిన అర్పిత అనే ముగ్గురు నామినేషన్‌లు దాఖలు చేశారు. వీరిలో టిడిపికి చెందిన విశాలాక్షి, వైసిపికి చెందిన అర్పిత ఇద్దరి నామినేషన్‌లు పలు కారణాల చేత అధికారులు స్క్రోటినిలో తిరస్కరించారు. నామినేషన్‌లు తిరస్కరణకు గురైన అభ్యర్థులు అప్పీల్‌కు హాజరు కాకపోవటంతో ఎన్నికల నియమావాలి మేరకు మంగళవారం సాయంత్రం టిడిపి అభ్యర్థి అరుణకు పోటీలో ఎవరు లేనందున ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయింది. కూటమి నేతలు అరుణ జ్ఞానశేఖర్ రెడ్డిలకు పూలమాలలు వేసి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి నర్సింహులు, ఆంజనేయ రెడ్డి, సీతాపతి, నందారెడ్డి, కామరాజు నాయక్, రవిరెడ్డి, విజయ్‌రెడ్డి, రామలింగారెడ్డి, బాలు, సుబ్రి, కృష్ణారెడ్డి, ఆదిల్, చంద్రశేఖర్ రెడ్డి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్



అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి- ఐరాల: ఈనెల 27 నుండి సెప్టెంబర్ 16వ తేదీ వరకు 21 రోజులు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కాణిపాకం ఆలయ ఈఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పూతలపట్టు ఎంఎల్ఏ కె. మురళి మోహన్, జిల్లా ఎస్పి మణికంఠ చందోలు, ఈఓ పెంచల కిషోర్, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 27 నుండి సెప్టెంబరు 16 వరకు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, వైద్యఆరోగ్య శాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లకు సంబంధించి ఆలయ ఈఓ అధ్యక్షతన సమన్వయ కమిటీ ఏర్పాటు చేయడం చేయడం జరిగిందని, ఈ కమిటీ ద్వారా ప్రాథమిక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఆలయ ఈవో, విద్యుత్ అధికారులు, ఫైర్ ఆఫీస్ అధికారులు సమగ్రంగాఆలయం వెలుపల, ఆలయంలోపల విద్యుత్ సౌకర్యం ఎలా ఉన్నది, ఎక్కడెక్కడ లోటుపాట్లు ఉన్నాయో పరిశీలించాలన్నారు, ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో చిత్తూరు నుండి, కాణిపాకం వచ్చే రోడ్లకు ఇరువైపులా ముళ్ళ చెట్లు, పొదలను చదును చేయాలని ఆదేశించారు. చిత్తూరు ఆర్డిఓ ఆధ్వర్యంలో ప్రోటోకాల్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రోటోకాల్‌లో ఎమ్మార్వోలను, డిప్యూటీ ఎమ్మార్వోలను విధులు నిర్వహించడానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేయుచున్నామని తెలిపారు. ఉత్సవాలలో ఎలాంటి పొరబాట్లు జరగకుండా జాగ్రత్తగా మీ విధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అంబులెన్సులు, నైపుణ్యం కలిగిన డాక్టర్లను నియమించాలని డిఎం అండ్ హెచ్‌ఓను ఆదేశించారు. డిపిఓ ఆధ్వర్యంలో కాణిపాక ఆలయ పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉండే విధంగా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కాణిపాక నగరంలో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు సురక్షితమైన తాగునీరు అందజేయాలని, ఆలయ ఉభయదారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలని అధికారులకు సూచించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో శాంతి భద్రతలు పరిరక్షించుటకు ప్రత్యేక డిఎస్పి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది, హోంగార్డు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నామని ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంతర సంఘటనలు జరగకుండా, దేవస్థానం ఆధ్వర్యంలో సీసీటీవీలో ద్వారా నిరంతర పర్యవేక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా 24/7 కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయక స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను భక్తుల సౌకర్యార్థం సమర్థవంతంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లను చేయడం జరుగుతుందన్నారు. లక్షలాది భక్తులు నిర్భయంగా, నిశ్చింతగా కాణిపాక బ్రహ్మోత్సవాలకు వచ్చి వరసిద్ధి వినాయకుని దర్శించుకుని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కాణిపాక ఆలయ ఈవో పెంచల కిషోర్, ఆలయ ఉత్సవ ఉభయ దారుడు బుజ్జి నాయుడు, ఆర్డీవో శ్రీనివాసులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో ప్రముఖులు





కర్ణాటక హోం మంత్రికి, ఎస్పీకి తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈవో పెంచల్ కిషోర్

ప్రజాశక్తి- ఐరాల: శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారిని మంగళవారం కర్ణాటక రాష్ట్ర హోంశాఖ మంత్రి పరమేశ్వర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరితో పాటు కర్ణాటక రాష్ట్రంకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ హోం మంత్రిని కలిసిన శాలవుతో సత్కరించారు. అలాగే జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రంను ఆలయ ఈవో అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ మణినాయుడు, మోహన్ రెడ్డి, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, డీఎస్పీ సాయినాథ్, సీఐ శ్రీధర్ నాయుడు, కాణిపాకం ఎస్సై నరసింహులు, తదితరులు ఉన్నారు.

ఒంటరి ఏనుగు హల్‌చల్..

హడలిపోతున్న అటవీ ప్రాంత రైతులు

ప్రజాశక్తి- రామకుప్పం: మండలంలోని పంద్యాల మడుగు గ్రామఅటవీ సమీపంలో ఒంటరి ఏనుగు స్వైరవిహారం చేస్తోంది. గత వారం రోజులుగా అటవీ గ్రామ సమీప పంటలను తొక్కి నాశనం చేయడం కాక వ్యవసాయ పరికరాలు కూడా ధ్వంసం చేసింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు యథేచ్ఛగా ఒంటరి ఏనుగు పంట పొలాలపై రావడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. గుంపు నుండి విడిపోయిన ఈ ఒంటరి ఏనుగు మండంలోని లక్ష్మీపురం, ననియాల తాండ, గొల్లపల్లి, పంద్యాల మడుగు, నారాయణపురం తాండ, పిఎంకె తాండ పరిసరాల్లో తచ్చాడుతోంది. అటవీ ట్రాకర్లు తపాకాయలు, బాణాసంచా పేల్చి అటవీ ప్రాంతంలోకి మళ్లించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా తిండి, నీరు రుచి మరిగిన ఒంటరి ఏనుగు అటవీ సమీపంలోని ఏదో ఒక గ్రామం వైపు పంటలపై విధ్వంసం సృష్టిస్తుంది. దీంతో పంట పొలాల వైపు వెళ్లేందుకు రైతన్నలు ప్రాణాన్ని అరిచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తుందని భయాందోళనకు గురవుతున్నారు.



పగటి పూట కూడా పొలాలకు సమీపంలో ఏనుగు

జిల్లాలో మిషన్ వాత్సల్య కింద

21 మందికి సహకారం



బాధిత పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

కోవిడ్ మహమ్మారి బారినపడి తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు భరోసా కల్పించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని చేపట్టి అమలు చేస్తున్నాయని, బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో మిషన్ వాత్సల్యలో భాగంగా బాధితులు వారి సంరక్షకులతో జిల్లా కలెక్టర్ ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ మహమ్మారి కారణంగా తల్లిదండ్రులు ఇరువురినీ కోల్పోయిన 21 మంది పిల్లలకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని, వీరికి ఒక్కొకరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి రూ.20లక్షలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని తెలిపారు. మిషన్ వాత్సల్య ద్వారా బాధిత పిల్లల ఆరోగ్యం, విద్య, తదితర అంశాలపై శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులను కోల్పోయిన లోటు తీర్చలేనిదని, కష్టాలను అధిగమించి ముందుకు వెళితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. బాధితుల సంరక్షకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం కావాలన్నా ప్రభుత్వానికి నివేదించి సహకారం అందిస్తామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఐసిడిఎస్ అధికారులను, జిల్లా కలెక్టర్‌ను కలవవచ్చన్నారు. బాధితుల సాధికారతకు ప్రభుత్వం తోడుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగదు జమ చేసిన పోస్ట్ ఆఫీసు పాస్ బుక్ లను బాధితులకు అందజేశారు. ప్రభుత్వం అందించిన సహకారంతో బాగా చదువుకొని ప్రయోజకులు కావాలని తెలిపారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో మిషన్ వాత్సల్యలో భాగంగా 18 సంవత్సరాల లోపు పిల్లల రక్షణ సంక్షేమం ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయం లోని సమావేశ మందిరంలో జిల్లా స్థాయి పిల్లల సంరక్షణ, సంక్షేమ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి మణికంఠ చందోలు, ఐసిడిఎస్ పీడీ వెంకటేశ్వరి, జెడ్పి సీఈఓ రవి కుమార్ నాయుడు, డీఈవో బి.వరలక్ష్మి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ అనాథ పిల్లలు, చైల్డ్ లేబర్, భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పించాలన్నారు. ఆగస్టు నుండి ప్రతి నెలా పిల్లల అపహరణ, అత్యాచారాలు, వేధింపులకు సంబంధించి వివరాలను అందించాలన్నారు. జిల్లాలో 8 నుండి 10 శాతం చైల్డ్ ప్రెగ్నెన్సీ కేసులు నమోదవుతున్నాయని, అబార్షన్ లు జరుగుతున్నాయని తెలిపారు. బేటి బచావో – బేటి పడావో కార్యక్రమం ద్వారా సమస్యాత్మక ప్రాంతాల్లో ఎంఎస్‌కేల ద్వారా అవగాహన చర్యలు చేపట్టాలని, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. సంక్షేమ హాస్టళ్ళ, రెసిడెన్షియల్ హాస్టళ్లను అధికారులు స్వయంగా తనిఖీ చేసి పిల్లల సమస్యలను తెలుసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో భాగంగా విద్యార్థులు వారి ఇంటి వద్ద, పాఠశాలలో, హాస్టళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, ప్రైవేట్ సంక్షేమ సంస్థల ద్వారా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సమస్య పరిష్కారంలో భాగంగా సమస్య జరిగిన ప్రదేశాలను గుర్తించి వారి కుటుంబాల దగ్గరకు వెళ్ళి కౌన్సెలింగ్ ఇవ్వడం, అత్యవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర వైద్యం, ఆవాసం వంటి ఖర్చులను ప్రభుత్వం నుండి భరించడం జరుగుతుందన్నారు. జిల్లా ఎస్పి మాట్లాడుతూ పోక్సో, అత్యాచార బాధితుల కుటుంబాలలో ధైర్యం నింపడం నైతిక బాధ్యత తీసుకోవాలని తెలిపారు. తలిదండ్రులు కొంత మంది చదవలేదని, మానసిక సమస్యలు ఉన్నాయని, బంధుత్వం అని ఇతర కారణాల కారణంగా మైనర్‌లకు వివాహం చేస్తున్నారన్నారు. జిల్లాలో సమస్యాత్మక 180 ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, కమిటీ సభ్యుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందన్నారు. 80కి పైగా ప్రభుత్వ బాలికల, మహిళల సంక్షేమ హాస్టల్‌లు ఉన్నాయని, వీటిని బయట వైపు నుండి సిసి కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని, వీటితో పాటు ప్రైవేట్ హాస్టళ్లను కూడా పర్యవేక్షిస్తున్నామన్నారు. పోక్సో, అత్యాచార కేసులకు సంబంధించి కమిటీ సభ్యులు సమస్య ప్రదేశాలకు వెళ్లి అసలైన బాధితుల వివరాలను నిర్ధారించడంలో సహకరించాలన్నారు.



సమావేశంలో మాట్లాడుత్ను కలెక్టర్, ఎస్పీ

'సూర్యఘర్' ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జిల్లాలో పియం సూర్యఘర్ పథకాన్ని ప్రజలకు చేరువ చేయడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో సౌరప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పీఎం సూర్య ఘర్ పథకం, ప్రణాళిక అమలు, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గ, జిల్లా విజన్ ప్రణాళికల పటిష్ట రూపకల్పనకు కృషి చేయాలన్నారు. పీఎం సూర్య ఘర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్స్ ఎక్కువ సంఖ్యలో నమోదు అయ్యేలా ఈ పథకంపై ప్రజలలో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి గ్రౌండింగ్, సోలార్ పలకలు అమర్చడం పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కువ శాతం ఎస్సీ, ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు. వీరితోపాటు బీసీ వర్గాల ప్రజలను కూడా రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అలాగే జిల్లాలో చేపట్టే సౌర ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. కుప్పం డివిజన్‌లో ఫీడర్ స్థాయి సోలరైజేషన్మొత్తం సామర్థ్యం 141 ఎంవి 705 ఎకరాలు భూమి అవసరమని, ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్టును మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, హైదరాబాద్‌కి అప్పగించడం జరిగిందని, 400 ఎకరాల భూమిని గుర్తించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ పిడీసీఎల్ డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అయుబ్ ఖాన్, సిజిఎం ప్రాజెక్ట్ రమాదేవి, ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఎండి రెస్కో సోమశేఖర్, డీవో ఎన్ఆర్ఇడిసిఎపి అబ్దుల్ గయాల్ తదితరులు పాల్గొన్నారు.

'పీఎం రాష్ట్రీయ బాలపురస్కార్'కు దరఖాస్తులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రధానమంత్రి (పీఎం) రాష్ట్రీయ బాలపురస్కార్ 2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదర్శప్రాయమైన పనులు, జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘసేవ, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపువారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 15వ తేదీలోపు వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి- పలమనేరు: మున్సిపల్ శాఖలో పనిచేసే ఔట్ సోర్సింగ్ వర్కర్స్ వేతనాలను ప్రభుత్వం పెంచడాన్ని హర్షిస్తూ స్థానిక మున్సిపల్ కార్మికులు మంగళవారం ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని కలసి సన్మానించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలసిన వారు శాలువాలతో సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. వేతనాలను పెంచాలని తాము చేపట్టిన ఆందోళనలను గుర్తించి ప్రభుత్వం వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకోవడం ఆనందదాయకమని తమ విధులను మరింత మెరుగ్గా నిర్వహించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ నాయకులు ప్రసాద్, రాజా, చిన్నీ, మురుగేష్, రాజేష్, వెంకటేష్, జీవా, షహారా భాను, భార్గవి, తులసి పాల్గొన్నారు.



వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

వాట్సాప్ గవర్నెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి -సోమల: దరఖాస్తు దారులు కార్యాలయాలకు రాకుండా ఇంట్లో వుంటూ తమకు అవసరమైన ధృవపత్రాలను వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సచివాలయ సిబ్బంది పేర్కొన్నారు. 'ప్రజల చేతిలో ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పంచాయతీలలో సచివాలయ సిబ్బంది, ప్రజలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో నారాయ ణ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలు తమకు అవసరమైన ధృవపత్రాలను తమ మొబైల్ ఫోనులోని వాట్సాప్ నెంబర్ ద్వారా దరఖాస్తు చేసి తర్వాత అధికారులు ధ్రువీకరించిన తర్వాత వాటిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని దీని ద్వారా దరఖాస్తు దారులు కార్యా లయాలకు వచ్చి దరఖాస్తు చేయనవసరం లేకుండా సులభంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ధృవపత్రాలు తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జయ శంకర్, ఫయాజ్, మేనక, వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



టిటిడి పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి- విజయపురం (నగరి) : పట్టణ పరిధిలోని దేశమ్మ దేవాలయంలో ఆడినెల ఉత్సవాల సందర్భంగా టిటిడి తరఫున అందించే పట్టు వస్త్రాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మంగళవారం సమర్పించారు. ఆడినెల ఉత్సవాల్లో భాగంగా దేశమ్మను ధనలక్ష్మి ఆకారంలో అలంకరించారు. రూపాయ నోట్లతో అత్యద్భుతంగా అలంకరించారు. టీఆర్ కండ్రిగకు చెందిన శేఖర్, విమల దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఆనవాయితీ ప్రకారం అమ్మవారికి టీటీడీ అందించే పట్టువస్త్రాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మవారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సన్మానం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల పరిధిలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు డాక్టర్ అరుణ్ కుమార్ , డాక్టర్ పద్మావతి వారి ఆధ్వర్యంలో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా కౌసర్ బేగం ఆశ వర్కర్ (24) సర్వీస్ పూర్తిచేసుకొని రిటైర్మెంట్ జూలై 31 వ తేదీ రిటైర్‌మెంట్ అయిన సందర్భంగా మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దేవదొడ్డిలో పనిచేస్తున్న ఏఎన్ఎం వినాయకమ్మ తవణంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయిన సందర్భంగా ఆమెకు మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ పద్మా వతి మాట్లాడుతూ వీరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ ప్రశంసించారు. ఎక్కడున్నా ఆరోగ్యం గా, మంచిపేరు తెచ్చుకోవాల అన్నారు. ఈకార్యక్రమంలో పీహెచ్ఎన్ శమంతక, హెల్త్ ఎడ్యుకేటర్ కాంతమ్మ, హెచ్ ఎస్ తిరుమలమ్మ, ఎస్ ఎన్ రెడ్డమ్మ, లక్ష్మి, రాజారెడ్డి, ఆయూబ్ ఖాన్, ఎం.ఎల్.హెచ్.పి లు, ఏఎన్ఎం లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కర్ణాటక హోం మంత్రికి సన్మానం

ప్రజాశక్తి -బంగారుపాళ్యం:
కర్ణాటక హోం మంత్రి పరమేశ్వర్ గౌడ సంఘ నాయకులు సత్కరించారు. మంగళవారం బంగారుపాలెం మండలం బొమ్మాయపల్లె గ్రామంలోని ఆర్ కె ఫామ్ హౌస్ లో చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ్ సంఘం గౌరవ అధ్యక్షులు గోపి గౌడ్ కర్ణాటక రాష్ట్ర హోం మంత్రి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి దర్శనానికి కుటుంబ సమేతంగా వెళుతున్న సందర్భంగా పరమేశ్వర్ గోపి గౌడ్ ఆయనను ఆహ్వానించి బొమ్మా యపల్లె ఆర్.కె.ఫామ్ హౌస్ లో హోం మినిస్టర్ దంపతులను కు శాలువా కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఈడిగ బిసి సంక్షేమ సమితి అధ్యక్షులు బుసా నాగరాజ గౌడ్, చిత్తూరు జిల్లా ఈడిగ గౌడ్ సంఘం యువసేన ప్రధాన కార్యదర్శి లోకేశ్వర మురళి గౌడ్, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ అట్టూరి ఎల్లప్పగౌడ్, బొమ్మ యపల్లె గౌరీనాథ్ గడ్డం శంకర్ గౌడ్, రమేష్ గౌడ్ ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి విద్యార్థులు

ప్రజాశక్తి- విజయపురం (నగరి):
జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నగరి మండలం నాగరాజకుప్పం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో నాగరాజకుప్పం జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదివే నికాస్, జ్యోత్స్న, 9వ తరగతి చదివే విమల్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభ రాజు, పీడీ గోపి, ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



పరీక్షల మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పరీక్షల మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -సోమల: మండలంలోని ప్రాథమిక, ఉన్నత ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు త్వరలో నిర్వహించబోయే పరీక్షలకు అవసరమైన అసెస్మెంట్ మెటీరియల్‌ను మండల విద్యాశాఖ అధికారిణి విజయకుమారి మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు త్వరలో నిర్వహించనున్న పరీక్షల నిర్వహణ కోసం ఎస్సీఈఆర్టీ అందించిన సామాగ్రిని మండల విద్యాశాఖ కార్యాలయంలో భద్రపరచారని ప్రస్తుతం ఆయా పాఠశాలలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్సి సిబ్బంది లావణ్య, అస్లాం నారాయణ పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.లక్ష 27 వేలు ఆదాయం

ప్రజాశక్తి -కార్వేటినగరం: స్కంద పుష్కరిణి సమీపంలో కుమారగిరిపై వెలసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి నిర్వహించే వార్షిక ఆడికృత్తిక వేడుకలను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన తలనీలాల వేలం పాటలో ఆలయానికి రూ. లక్ష 27 వేలు ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈవో కృష్ణనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ప్రతి ఏటా భక్తులు స్వామికి సమర్పించే తలనీలాల వేలం పాటలో వచ్చే ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామన్నారు. ఈ ఏడాది ఆడికృత్తిక వేడుకలను ఎండోమెంట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో వేలం పాటదారులు, ఎండోమెంట్ అధికారులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -గంగవరం: మంగళవారం విడుదలైన ఎస్వి యూనివర్సిటీ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ ఫలితాలలో మదర్ థెరిసా కళాశాల విద్యార్థులు బిసిఏ, బిబిఏ, బికాం, బిఎస్‌సి కోర్సులలో253 మంది డిస్టింక్షన్లు, 165 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థిని విద్యార్థులను, అధ్యాపకులను కరస్పాండెంటు కరెస్పాండెంట్ డాక్టరు ఎం రవీంద్ర బాబు, ఛైర్మన్ ఎం సునీల్ , అడ్వైజరు డాక్టరు రాజేంద్రరెడ్డిలు అభినందించారు.

చట్టాలకు లోబడి ప్రతి ఒక్కరూ పనిచేయాలి: సిఐ



ప్రజాశక్తి - రొంపిచర్ల: ప్రతి ఒక్కరూ చట్టాలకు లోబడి పని చేయాలని కల్లూరు సిఐ జయ రామ నాయక్ అన్నారు. ఆయన నూతనంగా బాధ్యతలు చేపట్టి మంగళవారం రొంపిచర్ల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ ఎవరైనా చట్టాలను అతిక్రమించి పనిచేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ వాతావరణాన్ని సృష్టించాలని అన్నారు. పోలీసులు గ్రామాల్లో రాత్రిపూట గస్తీ నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తూ ఉంటే వారిపై నిఘా పెట్టాలని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బి సుబ్బారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైద్యులు మెరుగైన సేవలు అందించాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పలమనేరు:
పలమనేరు ఏరియా ఆసుపత్రిలోని కొంతమంది వైద్యుల తీరు మారాలని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఆయన ఆయన కార్యాలయంలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో కొంతమంది సిబ్బంది పనితీరు సరిగా లేదని ఫిర్యాదులు అందుతున్నా యన్నారు. పేషెంట్ల పట్ల డాక్టర్లతో పాటు సిబ్బంది మర్యాద పూర్వకంగా మెలగాలని, సమస్యలతో వచ్చే వారిపట్ల సానుకూలంగా స్పందించి వైద్య సేవలు అందించాలన్నారు. ఇక ఆసుపత్రికి అవసరమైన సోలార్ సిస్టమ్, ఆక్సిజన్ పైప్ లైన్, అంబులెన్సు, బెడ్ల తదితరాల ఏర్పాటుకు ఎంతమేరకు నిధులు అవసరమవుతుందో ఎస్టిమేషన్ వేయాలన్నారు. ఇక ప్రధానంగా పలమనేరు పరిసర ప్రాంతాల నుంచి సుమారు 200 మంది దాకా డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారని డయాలసిస్ కేంద్రాన్ని ఇక్కడే ఏర్పాటు చేసేలా ఇప్పటికే ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తున్నామన్నారు. ఇక (ఎన్ హెచ్ ఎం) నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా మరిన్ని సదుపాయాలు ఆసుపత్రికి రానున్నాయని ఇవి కాకుండా ఇంకా ఏవైనా అవసరాలు ఉంటే వాటిని తెలియజేస్తే వాటి ఏర్పాటుకు కృషి చేస్తానని ఏరియా ఆసుపత్రిని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని ఆయన ఆసుపత్రికి మంచి పేరును తెచ్చేందుకు సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ మమతారాణి, వైద్యులు యుగంధర్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించాలి

ప్రజాశక్తి- కార్వేటినగరం : లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు సకాలంలో అందించాలని జాతీయ పథకాల పరివేక్షణ బృందం (ఎన్ఎల్ఎం) సభ్యులు డాక్టర్ ప్రశాంత్ కుమార్, డాక్టర్ మణికంఠ పేర్కొన్నారు. మండలంలోని అన్నూరు గ్రామ పంచాయతీలో ఎన్ఎల్ఎం బృంద సభ్యులు మంగళవారం పర్యటించారు. గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా మంజూరు అయిన పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నాయా? లేదా పథకాలు అందటంలో ఏమైనా జాప్యం జరుగు తుందా? అని ప్రజలతో ముఖాముఖి మాట్లాడి పథకాలను ఏ విధంగా అభివృద్ధి కోసం ఉపయోగిస్తున్నారు? అని అడిగి తెలుసుకున్నారు. వాళ్లతో పాటు జిల్లా అధికారులు, డిఆర్‌డిఏ పీడీ శ్రీదేవి, డ్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున్, డ్వామా ఏపీడీ సునీల్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి చంద్రమౌళి, కార్వేటినగరం మండలంలోని లైన్ డిపార్టుమెంట్స్ అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పర్యటిస్తున్న పంచాయతీ జాతీయ పథకాల పర్యవేక్షణ బృందం

ఇచ్చిన హామీలు నిలుపుకోవాలి

సిపిఎం ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి -గంగవరం: ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలుపుకోవాలని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. గంగవరం మండల కేంద్రంలో సిపిఎం, వామపక్షాల పిలుపులో భాగంగా నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా జిల్లా నాయకులు హంగేరి ఓబుల రాజు మాట్లాడుతూ పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని, ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం మోపవద్దని, ఇళ్లకు, షాపులకు, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని కోరారు. అదానీతో చేసుకొన్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుచేయాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టాలని పిలుపు నిచ్చారని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ మంత్రి ప్రభుత్వమే స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నా దీనికి మంత్రి సమాధానం చెప్పడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచం.. అదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాలపై సమీక్షిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు నోరు మెదపడం లేదు.. ఎందుకని ప్రశ్నించారు. విద్యుత్ బిల్లులు కట్టేందుకు ప్రజలు అప్పులు పాలు అవుతున్నారని పనులు లేక కుటుంబాల నడవడం కష్టంగా ఉన్న ఈ తరుణంలో ప్రభుత్వం ఆదుకోవాల్సింది పోయి విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రజలను పీల్చి పిప్పి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పేద ప్రజల బాగు కోసం కాకుండా పెట్టుబడిదారులు, ఉన్నత వర్గాలకు ఊడిగం చేసే పనిలో బిజీగా వుందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ ఛార్జీలపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి తీసుకుని ఛార్జీలు తగ్గించి ట్రు అప్ ఛార్జీలను రద్దు చేసుకుని ప్రజలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఈశ్వర, పాకాల సుబ్రహ్మణ్యం, నరసింహులు, శివ ఆదర్శ,హేమంత్, వెంకటేష్, సోము పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

లిక్కర్ కుంభకోణం గురించి ప్రజలకు తెలపాలి: కాంగ్రెస్

ప్రజాశక్తి -పుంగనూరు: గత వైసిపి పాలనలో చోటు చేసుకున్న లిక్కర్ కుంభకోణంపై రాష్ట్ర ప్రజలకు పూర్తి స్థాయిలో తెలిపి దీనిపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు సజ్జద్ బాషా మంగళవారం ఓ ప్రకటనలో డిమాండు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని, గత వైసిపి ప్రభుత్వంలో చోటుచేసుకున్న లిక్కర్ అవినీతిపై పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. రాష్ట్ర ప్రజలు అయోమయ స్థితిలో ఉన్నారని, ఏది నిజం ఏది అబద్దం పత్రికల్లో సోషల్ మీడియాలో కోట్లాది డబ్బు వెలుగు చూస్తున్నాయి. ఈ డబ్బు ఎవరికి చెందిందో ప్రజలకు తెలపాలన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు అరెస్టు కావడం ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు కూడా అరెస్టు కావడం అధికారులు పాత్ర కూడా ఉండడం ఆంధ్రప్రదేశ్‌కు సిగ్గుచేటు అన్నారు. అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాల్సిన ప్రభుత్వాలు ఇలా కుంభకోణాలతో ప్రజాధనం కోట్లాది రూపాయలు ఆర్జించడం దురదృష్టకరం, బాధాకరమన్నారు. వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి ఈ ముఖ్యమైన సమావేశాలను లైవ్ ద్వారా ఐదు కోట్ల ప్రజలకు వివరించాలని సూచించారు. లిక్కర్ కుంభకోణం గురించి పూర్తి స్థాయిలో ప్రజలకు తెలపాలన్నారు.

ఘనంగా తల్లి పాల వారోత్సవాలు

ప్రజాశక్తి- తవణం పల్లె:
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళ వారం తల్లి పాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తల్లి పాల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ నెల 12 వతేదీ నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల దినోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి ప్రియాంక, సిహెచ్‌వోలు జ్ఞాన శేఖర్, రాజమణి , పిహెచ్ఎన్ లు జీవకళ, ఆరోగ్య పర్యవేక్షకులు డి రాజశేఖర్, గోపి, నిర్మలమ్మ, టిబి సూపరువైజర్ శివకుమార్, ఎయిడ్స్, లెప్రసీ కంట్రోల్ అధికారి మణి, హెల్త్ అసిస్టెంట్స్, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని అంగన్‌వాడీ సూపరువైజర్లు కే అనురాధ, ఆర్ సంగీతలు పేర్కొన్నారు. మంగళవారం గంగాధర నెల్లూరు ఎన్టీఆర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా పిల్లలకు పౌష్టిక ఆహారంపై అవగాహన, తల్లిపాల విశిష్టతపై వివరించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు, ముర్రు పాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారన్నారు. రొమ్ము క్యాన్సర్లు నివారించడానికి కూడా తల్లిపాల విశిష్టత కలిగి ఉంద న్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుధారాణి, స్కూల్ టీచర్స్, పద్మజ అంగన్‌వాడీ పిల్లల తల్లులు పాల్గొన్నారు.

రొంపిచర్ల : పుట్టిన బిడ్డకు ముర్రుపాలు మొదటి టీకా వంటిదని పులిచెర్ల సిడిపిఓ వాణి శ్రీదేవి అన్నారు. ఆమె తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మంగళవారం రొంపిచర్ల మండలం బండ కింద పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వాణి శ్రీదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. ఈ పాలు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డలకు ఎలాంటి జబ్బు వచ్చినా తట్టుకునే శక్తి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపరువైజర్ శిరీష, అంగన్‌వాడీ టీచర్ తహసీరా, గర్భిణులు పాల్గొన్నారు.

సోమల: తల్లిపాల వారోత్సవాలను వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని ఆశాడే సమావేశంలో వైద్యులు సిబ్బందికి సూచించారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తల్లిపాలు అప్పుడే పుట్టిన బిడ్డకు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెరగడం బిడ్డ ఎదుగుదలకు ఎంతో తోడ్పడుతుందని కావున తల్లులు ముర్రుపాలను బిడ్డలకు తాగించాలని తల్లిపాల వారోత్సవాలలో తల్లులకు తెలపాలని కోరారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా గ్రామాలలో మురుగునీరు నిలిచి దోమలు ప్రబలి గ్రామాలలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి దోమతెరలు వాడడం, సాయంత్రం వేళల్లో వేపాకు పొగ ఇంటిలో వేయడం తెలియజేసి అనారోగ్యం అనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పనిచేయని బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమల చుట్టుపక్కల గ్రామాలలో బిఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ గత ఐదు రోజులుగా సిగ్నల్స్ సరిగా అందక పోవడం, ఫోన్ చేస్తే ఎదుటి వారి వాయిస్ వినిపించకపోవడం, నెట్‌వర్క్ బిజీ రావడం, ప్రస్తుతం అందుబాటులో లేరని వస్తోంది. మరీ ముఖ్యంగా వీధుల్లో ఉంటే కాస్తకూస్తో కాల్స్ రావడం నెట్‌వర్క్ పనిచేస్తోంది. ఇళ్లలోకి వెళితే నెట్‌వర్క్ రాక వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బిఎస్ఎన్ఎల్ అధికారులు మండల కేంద్రంలో నెలకొన్న పరిస్థితిని పరిశీలించి బిఎస్ఎన్ఎల్ సెల్ నెట్‌వర్క్ వినియోగదారులు పరిష్కరించాల్సిన అవసరం వుంది.

వేధించడం మానుకోకపోతే ఆత్మహత్య

ఎండోమెంట్ పరిశీలన అధికారి సుమన ప్రియ

ప్రజాశక్తి -బంగారుపాలెం: ఇతర మతస్తులను వేధించడం మానుకోకపోతే ఆత్మహత్య శరణమని ఎండోమెంట్ పరిశీలన అధికారి సుమన ప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని పత్రికా విలేకరుల సమావేశం లో ఆమె మాట్లాడుతూ మే నెలలో జరిగిన హుండీ లెక్కింపుల్లో 13 వేల రూపాయలు అపహరించారని, గ్రామానికి చెందిన ప్రసాదు ఎండోమెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు ఒకటో తేదీ అత్యవసర విచారణ పేరుతో ఆలయానికి రమ్మని 'నన్ను ఉద్యోగం నుండి సస్పెండ్ చేశారు' అని తెలిపారు. ఆ తర్వాత నేటి నుండి అన్నమయ్య జిల్లాకు చెందిన అధికార ద్వారా విచారణ చేపట్టగా గ్రామానికి చెందిన ప్రసాదు ధనుంజయ నాడు కొంతమంది గ్రామస్తులు హాజరై నా వైవాహిక జీవితం గురించి, నా పిల్లల పెళ్ళిళ్ల గురించి తక్కువ చేసి మాట్లాడారని తాను ఇతర మతస్తుడిని



వివాహం చేసుకున్నది వాస్తవమేనని, అయితే తాను హిందువుగానే కొనసాగుతున్నానని హిందూ మతాన్ని ఎప్పుడూ వ్యతిరేకించ లేదని తనపై లేని పోనీ అభాండాలు మోపి నన్ను ఉద్యోగం నుండి సస్పెండ్ చేసేందుకు కార్యాలయంలోని తిమ్మారెడ్డి నా వ్యక్తిగత సమాచా రాన్ని ఇతరులకు అందించి తీవ్ర మనస్థాపానికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవమానాలు భరించలేక ఆత్మహత్య శరణమని తన ఆత్మహత్యకు మొగిలి గ్రామానికి చెందిన ప్రసాద్ కారణమవుతాడని ఆమె వాపోయారు.

తడి, పొడి సాగు పద్ధతిపై శిక్షణ

ప్రజాశక్తి -విజయపురం (నగరి):
తడి పొడి సాగు పద్ధతిని అవలంబిస్తే తక్కువ నీటితో దిగుబడి తగ్గకుండా వరిసాగు చెయ్యవచ్చని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. మంగళవారం మండలంలోని ఎం.కొత్తూరు రైతు సేవా కేంద్రంలో ప్రత్యామ్నాయ తడి, ఆరబెట్టే పద్ధతి (ఎడబ్ల్యుడీ)పై రైతులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ జనాభా ప్రధాన ఆహారంగా వాడే వరి పంటను సాగు చేయడానికి ఎక్కువ మోతాదులో నీరు అవసరమని సంప్రదాయ పద్ధతిలో కిలో బియ్యం ఉత్పత్తి చేయడానికి 3000 నుండి 5000 లీటర్ల నీరు అవసరమవుతుందన్నారు. ఇది ఇతర ఆహార ధాన్యాల ఉత్పత్తికి అయ్యే నీటి వినియోగం కంటే 2, 3రెట్లు అధికమన్నారు. ఇది ఇలానే ఉంటే రానున్న కాలంలో 15 నుండి 20 మిలియన్ హెక్టార్ల వరి పొలాలు నీటి ఎద్దడి సమస్యని ఎదుర్కొనే అవకాశం వుందని అంచనావేశారన్నారు.తక్కువ నీటితో ఎక్కువ ఉత్పాదకత సాధించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. వ్యవసాయ నిపుణులు పుష్ప మాట్లాడుతూ తడి, పొడి సాగు పద్ధతిలో నీటి యాజమాన్యం అనగా "క్రమంగా నీరు పెట్టడం, ఆరబెట్టడం' అనే పద్ధతిలో రెండు తడుల మధ్య సమయం వాతావరణ పరిస్థితులు, నేల రకం, పంట కాలాన్ని బట్టి 1 నుండి 10 రోజుల వరకు వుంటుందన్నారు. ఈ పద్ధతిలో వరి సాగు చేయడం ద్వారా తెగుళ్లు, రోగాలు తక్కువగా వస్తుందని, అధిక దిగుబడిని పొందవచ్చునని బ్లాక్ బోర్డు డెమో ఇచ్చి తెలిపారు. రైతుల పొలాలకు వెళ్లి పైపులు అమర్చి నీళ్లు ఎలా ఉంచాలో ప్రత్యక్షంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కవిత, వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, ఎన్ఎఫ్ఏటీ నాంచారమ్మా, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ పైజునిషా, ఎన్ఎఫ్ఎంటీ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్



భార్యపై భర్త దాడి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: భార్యపై భర్త దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి మండలంలోని పాలేరు పంచాయతీ మోతకుంట గ్రామంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసులు కథనం మేరకు.. మోతకొండ గ్రామానికి చెందిన రాజేష్ భార్య సోనీ (25) గత ఐదు సంవత్సరాలకు క్రితం వివాహమైంది. రాజేష్ ప్రవర్తన సరిగా లేకపోవడంతో సోనీ వారిని వదిలి అమ్మగారింటికి చేరుకుంది. సోమవారం రాత్రి రాజేష్ తమ్ముడు సందీప్ ఇరువురు సోనీపై దాడి చేసి మామిడి చెట్ల కు ఉపయోగించే పురుగు మందును తాగించాడు. దీంతో బంగారుపాలెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేపట్టి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ఆర్‌డివోకు వినతిపత్రం అందిస్తున్న ఏపీయుడబ్ల్యుజే నాయకులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి -విజయపురం (నగరి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీయుడబ్ల్యుజే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌డీవో అనుపమకు మంగళవారం వినతిపత్రం అందించారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయానికి వెళ్లినవారు జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు త్వరగా అందజేయాలని, ప్రమాదబీమా అవకాశాన్ని కల్పించాలని, అక్రిడిటేషన్ కమిటీలో జర్నలిస్టు యూనియన్‌కు అవకాశం కల్పించాలని, జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయించాలని, విశ్రాంత పాత్రికేయులకు పెన్షన్లు అందించాలని కోరారు. ఈ మేరకు వినతిప్రతం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీయుడబ్ల్యుజే జిల్లా సహకార్యదర్శి కె.చంద్రమోహన్, కార్యనిర్వాహక సభ్యులు జి.సుబ్రమణ్యం, పాత్రికేయులు తులసీరాముడు, మోహన్, విజయ్, వీటీ భాస్కర్, భాగ్యరాజ్ ప్రతాప్ పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఆహార పరిశీలన కమిటీ సభ్యులు

పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి

రాష్ట్ర ఆహార పరిశీలన కమిటీ సభ్యులు దేవి గంజిమాల

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఆహార పరిశీలన కమిటీ సభ్యులు దేవి గంజిమాల అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్ల కట్టమంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజన అందించాలని భోజనం తయారీ సమయంలో. కట్టెల తో కాకుండా గ్యాస్ పొయ్యితోనే వంటలు చేయాలని వంటలు చేసేటప్పుడు పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం వంటల్లో రుచి చూశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ ఇందిరా, మండల విద్యాశాఖ అధికారి రమేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రి తనిఖీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార భద్రత కమీషన్ సభ్యురాలు గంజిమాల దేవి మంగళవారం సాయంత్రం మండలంలోని బసవరాజుకండ్రిగ ప్రభుత్వ చౌకదుకాణం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆగస్టు నెలకు సంబంధించి చౌక దుకాణానికి ప్రభుత్వం నుండి వచ్చిన బియ్యం, చక్కెర, డీలర్ కార్డుదారులకు పంపిణీ చేసి, మిగిలిన బియ్యం, చక్కెర రిపోర్టర్లను పరిశీలించి,రేషన్ డీలర్స్ సమయపాలన పాటించాలని సూచించారు. అనంతరం పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ డీఎస్ఓ శంకరన్,డీఎస్ఓ డిటి శ్యాం ప్రసాద్ రెడ్డి, ఇన్‌ఛార్జి తహశీల్దార్ రమేష్, డిఎస్ ఓ కార్యాలయ సిబ్బంది శేఖర్, డాక్టరు మురళి, వీఆర్వో శివ పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ మెంబర్ తనిఖీలు

ప్రజాశక్తి-పలమనేరు:
పలమనేరులో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలను, ఎఫ్ సి గోడౌన్, గంగవరంలో అంగన్‌వాడీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి గంజిమాల మంగళవారం తనిఖీ చేసి, తగు సూచనలు అందించారు. ఆహారంలో నాణ్యత పాటించాలని సూచించారు.

జీవో నెంబర్ 77ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- పలమనేరు: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 6,400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్స్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పేద విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేసి పేద విద్యార్థులకు పీజీ విద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు మున్నాస్ పేర్కొన్నారు. పలమనేరులోని ఓ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఓ సంఘం పలమనేరు పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర సమితి సభ్యులు మున్నాస్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 6,400 కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్ మెంట్స్ , స్కాలర్ షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పేద విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెంబర్ 77ను రద్దు చేసి పేద విద్యార్థులకు పీజీవిద్యను అభ్యసించేందుకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు. పలమనేరు సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.